తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ శనివారం 04 - 07 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజిలు : 6



# శ్రీవెంకటేశ్వరస్వామి ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కిశోర్ కుమార్

**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ 4వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో శుక్రవారం తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిశోర్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు, బీఆర్ఎస్ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు మాజీ ఎమ్మెల్యే కిశోర్ కుమార్‌కు వేద ఆశీర్వచనం చేసి, స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ సుఖశాంతులతో ఉండాలని స్వామివారిని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నేవూరి ధర్మేందర్ రెడ్డి, మదర్ డెయిరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మీనర్సింహారెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్లు తీపిరెడ్డి మేఘారెడ్డి, కొణతం యాకూబ్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పొన్నెబోయిన రమేష్, పట్టణ అధ్యక్షుడు జంగ శ్రీను, ప్రధానకార్యదర్శులు గిరగాని శ్రీను, గజ్జి మల్లేష్, మున్సిపల్ కౌన్సిలర్లు కొండా శోభసోంమల్లు, నల్ల మధు, నాయకులు చౌగోని సత్యం గౌడ్, బయ్యని పిచ్చయ్య, కొండా సోంమల్లు, దబ్బేటి శైలజ, మల్లం అనిత, కట్టా ఇంద్రజ్యోతి, అభినయ శ్రీనివాస్, బుశిపాక గణేష్, చెడిపెల్లి రఘుపతి, బందెల శ్రీను, చొల్లేటి నరేష్ తదితరులు పాల్గొన్నారు.





# కాంగ్రెస్ మోత్కూరు మండల అధ్యక్షునిగా బాలరాజు

ప్రజావారధి/మోత్కూరు

కాంగ్రెస్ మోత్కూరు మండల అధ్యక్షులుగా మండలంలోని పాటిమట్ల గ్రామానికి చెందిన రాచకొండ బాలరాజు నియమితులయ్యారు. బాలరాజు ఇప్పటి వరకు కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తుండగా మండల అధ్యక్షునిగా నియమిస్తూ పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌ను హైదరాబాద్‌లోని నివాసంలో నూతన అధ్యక్షునిగా నియమితులైన బాలరాజు మర్యాద పూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకోగా ఎమ్మెల్యే ఆయనకు నియామకపత్రం అందజేశారు. తన నియామకం కోసం కృషి చేసిన ఎమ్మెల్యే సామేల్, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి బాలరాజు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ బలోపేతంతో పాటు కార్యకర్తలకు నిత్యం అందుబాటులో ఉండి పని చేస్తానని, రానున్న ఎన్నికల్లో పార్టీ





గెలుపు కోసం కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుండగోని రామచంద్రు, మున్సిపల్ చైర్మన్ గడ్డం స్వప్నసోమనర్సయ్య, మార్కెట్ చైర్మన్ నూనెముంతల విమలవెంకటేశ్వర్లు, సింగిల్ విండో చైర్మన్ పేలపూడి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# యూరియా యాప్ రద్దు చేయాలి

- పాత పద్ధతిలోనే యూరియా సరఫరా చేయాలి
- రైతు సంఘం మండల కార్యదర్శి ప్రభాకర్

ప్రజావారధి/మోత్కూరు

రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న యూరియా యాప్‌ను వెంటనే రద్దు చేయాలని, ఆన్‌లైన్‌తో సంబంధం లేకుండా భూమి సాగుచేస్తున్న ప్రతి రైతుకు పాత పద్ధతిలోనే యూరియా సరఫరా చేయాలని రైతు సంఘం మోత్కూర్ మండల కార్యదర్శి దడిపల్లి ప్రభాకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మోత్కూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యూరియా సరఫరా కోసం ప్రవేశపెట్టిన కొత్త యాప్ కారణంగా సాగుభూమి ఉండి కూడా



పట్టాదారు పాసు పుస్తకాలు లేని అనేక మంది రైతులు యూరియా పొందలేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రైతులు నార్లు పోసి నాట్లు వేసేందుకు సిద్ధమవుతుండగా చాలా మంది రైతులకు స్మార్ట్ ఫోన్లు లేవని, గ్రామాల్లో సిగ్నల్స్ ఉండకపోవడంతో యాప్‌ను ఉపయోగించి యూరియా బుక్ చేసుకోవడం ఇబ్బందిగా మారిందన్నారు. యాప్‌ల పేరుతో ప్రభుత్వం రైతులను ఇబ్బందులకు గురించేయడం సరికాదని, పాత పద్ధతిలోనే రైతాంగానికి యూరియా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో వ్యవసాయ పెట్టుబడి భారం పెరిగిందని, రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందించాలని కోరారు.

# ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- మున్సిపల్ కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న
- 11వ వార్డులో ఫ్రైడే-డ్రై డేపై ప్రజలకు అవగాహన



**ప్రజావారధి/మోత్కూరు**

ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పరిసరాల పరిశుభ్రతతోనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని మోత్కూరు మున్సిపల్ 11వ వార్డు కౌన్సిలర్ కారుపోతుల వెంకన్న అన్నారు. ఫ్రైడే-డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ కేంద్రంలోని 11వ వార్డు గాంధీనగర్‌లో ప్రజలకు అవగాహన కల్పించారు. మంచినీటి సంపులను శుభ్రంగా ఉంచుకోవాలని, డ్రమ్ములు, కుండీలు, టైర్లు తదితర వాటిల్లో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానా కాలం ప్రారంభం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా నీరు నిల్వ ఉండకుండా చూడాలని, చెత్తాచెదారం వీధుల్లో వేయవద్దని కోరారు. విష జ్వరాలు, మలేరియా, డెంగ్యూ, చికున్‌గున్యా వంటి రోగాలు దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు ప్రతి శుక్రవారం ఫ్రైడే- డ్రై డేగా పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 12వ వార్డు కౌన్సిలర్ మెంట రమణనగేష్, వార్డు ఆఫీసర్లు సంధ్యారాణి, కిరణ్, కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి రమేష్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అవిశెట్టి కిరణ్ కుమార్, ఎన్‌ఎస్‌యూఐ మండల అధ్యక్షుడు నిమ్మల శ్రీను, నాయకులు రాహుల్, బిందెల రవి, మున్సిపల్ సిబ్బంది నరేందర్, డీఎల్‌ఓ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా రాజకీయ శిక్షణా తరగతులను విజయవంతం చేయాలి




**ప్రజావారధి/మోత్కూరు**

ఈ నెల 4,5,6 తేదీల్లో భువనగిరిలోని శ్రీసాయి శ్రీనివాస ఫంక్షన్ హాల్లో నిర్వహిస్తున్న సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను విజయవంతం చేయాలని సీపీఎం మోత్కూరు మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు కోరారు. మోత్కూర్ మండలం రాగిబావి గ్రామంలో శుక్రవారం సీపీఎం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ శిక్షణా తరగతుల ప్రారంభకులుగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్ వేస్లీ, వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత కార్యదర్శి బి.వెంకట్, పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య హాజరవుతున్నారని తెలిపారు. శిక్షణ తరగతులకు శాఖ కార్యదర్శులు, మండల కమిటీ సభ్యులు, మండల కార్యదర్శులు, జిల్లా కమిటీ సభ్యులు, ప్రజా సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు హాజరవుతారన్నారు. ప్రజా సమస్యలపై పోరాటం, భవిష్యత్ పార్టీ కార్యక్రమాలపై కార్యాచరణ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు పానుగుల రమేష్, మెండు శేఖర్ రెడ్డి, అరిగె సాలయ్య, కక్కేరేని నర్సయ్య, ఎలుగు పర్వతాలు, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
04 - 07 - 2026

# ముగిసిన శ్రీ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు



## నాలుగు రోజులు వైభవంగా జరిగిన ఉత్సవాలు

ప్రజావారధి/మోత్కూరు

మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ 4వ వార్షిక బ్రహోత్సవాలు శుక్రవారం చక్రస్నానంతో ముగిశాయి. నాలుగు రోజుల పాటు ఉత్సవాలను నిర్వాహకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. శాంతిపాఠం, ద్వార పూజలు, హోమం, మహా పూర్ణాహుతి, తిరుమంజనం, స్నపణము, చక్ర స్నానం, పుష్ప యాగం కార్యక్రమాలు యాదగిరిగుట్ట రిటైర్డు ప్రధానార్చకులు కారంపూడి నర్సింహాచార్యులు ఆధ్వర్యంలో అరుణ్ కుమారాచార్యులు నేతృత్వంలోని అర్చక బృందం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అర్చకులు వెంకట రమణాచార్యులు, దేవాలయ నిర్మాణ దాత ఎగమాటి రాంరెడ్డి అరుణ, స్థల దాత సూరం సోమిరెడ్డి రమాదేవి, దేవాలయ కమిటీ గౌరవాధ్యక్షుడు సోలిపురం చంద్రారెడ్డి, అధ్యక్షుడు ముప్ప వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులు ఏలే ఉప్పలయ్య, దామెర స్వాతిసోమయ్య, ప్రధాన కార్యదర్శి గుండా మల్లేష్, కోశాధికారి అమనగంటి వెంకట్ రెడ్డి, సహాయ కార్యదర్శి ముప్ప తిరుమల్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు మొగుల్లపల్లి సోమయ్య, గుండా బాలాజీ, పైళ్ల పుష్పలతసోమిరెడ్డి, మర్రి జయశ్రీ, పులిపాటి సత్యవతి, గడ్డమీది రమేష్, గట్టు వేంకటేశ్వర్‌రావు, బుడ్డి వేంకటేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.





తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
04 - 07 - 2026

# మోత్కూరు నుంచి హైదరాబాద్‌కు బస్సులు నడపాలి

**ప్రజావారధి/మోత్కూరు**

మోత్కూర్ నుండి హైదరాబాద్‌కు నేరుగా ఆర్టీసీ బస్సులు నడపాలని మైనార్టీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండి.ఆయాజ్, యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు దాసరి ప్రవీణ్ కోరారు. శుక్రవారం మోత్కూరు ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చిన యాదగిరిగుట్ట డిపో మేనేజర్ సురేష్ కుమార్, సీఐ ప్రవీణ్ కుమార్‌లకు వారు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోత్కూరు నుంచి నేరుగా హైదరాబాద్‌కు బస్సులు లేకపోవడంతో ఇక్కడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి బస్సులు వచ్చే వరకు గంటల తరబడి ప్రయాణికులు బస్టాండ్‌లో



వేచి చూడాల్సి వస్తుందని, ప్రయాణికుల ఇబ్బందులు తప్పేలా మోత్కూరు బస్టాండ్ నుంచే నేరుగా బస్సులు నడిపితే ప్రయాణికులకు ఇబ్బందులు తప్పుతాయని, అధికారులు స్పందించి బస్సులు నడపాలని కోరారు.

# సర్ నమోదును పారదర్శకంగా నిర్వహించాలి



**ప్రజావారధి/మోత్కూరు**

ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) నమోదును పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించాలని సూర్యాపేట జాయింట్ కలెక్టర్ (రెవెన్యూ) హరిసింగ్ అధికారులను ఆదేశించారు. మోత్కూర్ మండలంలోని కొండగడప, పాటిమట్ల గ్రామాల్లో ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎల్‌వోలు ఎన్యుమరేషన్ ఫారాలను ఇంటింటికీ పంపిణీ చేయాలని, ఓటర్లకు ఫారాలు నింపే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు నమోదయ్యేలా ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు కూడా అవసరమైన పత్రాలతో బీఎల్‌వోలకు సహకరించి నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. తహసీల్దార్ జ్యోతి, ఆర్ఐ సుమన్‌రెడ్డి, బీఎల్‌వోలు ఆయన వెంట ఉన్నారు.

తెలంగాణ ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక
04 - 07 - 2026

# మధ్యాహ్న భోజనంతో..
# ఉపాధ్యాయుల సమస్యలను పక్కదారి పట్టించడమే

## పీఆర్‌టీయూ జిల్లా నాయకులు వెంకటయ్య



**ప్రజావారధి/మోత్కూరు**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులకు కూడా ప్రభుత్వం అల్పాహారం అందిస్తామని చెప్పడం ఉపాధ్యాయుల సమస్యలను పక్కదారి పట్టించడమేనని పీఆర్‌టీయూటీఎస్ జిల్లా నాయకులు ధర్మారపు వెంకటయ్య అన్నారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన మెనూతో మధ్యాహ్నం భోజనం అందిస్తే చాలని, ఏ ఉపాధ్యాయుడు కూడా మాకు మధ్యాహ్నం భోజనం కావాలని అడగలేదన్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను వెంటనే విడుదల చేయాలని, పీఆర్సీని ప్రకటించాలన్నారు. ఉపాధ్యాయుల వర్క్ అడ్జెస్ట్ మెంట్‌ను ఆగస్టు 2026 విద్యార్థుల సంఖ్య ఆధారంగా చేయాలని కోరారు. ప్రభుత్వ ఉపాధ్యాయులను ప్రజల దృష్టిలో చులకన చేసే నిర్ణయాలు ప్రభుత్వం తీసుకోవద్దని, ప్రభుత్వ విద్యారంగ వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటే పీఆర్‌టీయూటీఎస్ ఆధ్వర్యంలో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు.